'పెద్ది'కి పర్సంటేజ్ కావాల్సిందే.. తెలంగాణ ఎగ్జిబిటర్ల కీలక నిర్ణయం

విశ్వంభర, హైదరాబాద్: రాష్ట్రంలో పర్సంటేజ్ ప్రకారమైతేనే ఇకపై సినిమాలు ఆడిస్తామని తెలంగాణ ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు. శనివారం తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో సమావేశమైన ఎగ్జిబిటర్స్ కీలక నిర్ణయం ప్రకటించారు.రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో రాబోతున్న 'పెద్ది' మూవీకి కూడా పర్సంటేజ్ కావాల్సిందేనన్నారు.తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ శ్రీధర్ తదితరులు మాట్లాడుతూ.. ''తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు మూడు సార్లు చర్చలు జరిగాయి. 'హరి హర వీరమల్లు' విడుదల సమయంలో రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తామన్నారు. కానీ, సంవత్సరం అయిపోయింది. నిర్మాతలు కావాలనే ఆలస్యం చేస్తున్నారు. ముందు మూడు వారాలన్నారు. కానీ, ఇప్పుడు మళ్లీ ఇంకొక మూడు వారాలు వాయిదా వేస్తున్నారు. పర్సంటేజ్ ప్రకారమే సినిమాలు ఆడిస్తాం''''120 మంది థియేటర్ల యజమానులు దీనస్థితిలో ఉన్నారు. 10, 15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి ఆదాయం ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్స్‌కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంది. దేశవ్యాప్తంగా థియేటర్స్‌లో పర్సంటేజ్ విధానమే నడుస్తోంది. ఇక్కడ మాత్రం రెంటల్ ఉంది. సమస్యను రోజురోజుకీ ఆలస్యం చేస్తున్నారు. మా థియేటర్లలో రెంట్ ట్రాక్ అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. మా దగ్గర ఎక్కడా తప్పు జరగదం లేదు. థియేటర్ల సౌండ్ సిస్టమ్, ఏసీలను బట్టి కాదు, అక్కడ వచ్చే కలెక్షన్లను బట్టి గ్రేడింగ్ చేయాలి. అలాంటి గ్రేడింగ్‌కు మాత్రమే మేము సిద్ధం. మాకు పర్సంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి''.

తెలంగాణలో 'పెద్ది' టికెట్ రేట్లు పెంచొద్దని కోరాం!

''ఆంధ్రాలో మాత్రమే 'పెద్ది' టికెట్ రేట్ల పెంపు ఉండొచ్చు. తెలంగాణలో పెంపులేదు. రేట్లు పెంచొద్దని, ప్రేక్షకులను చంపొద్దని సీఎం రేవంత్‌రెడ్డి, ఎగ్జిబిటర్లు, ఛాంబర్‌కు లేఖ ఇచ్చాం. ఒకవేళ పెంచుతూ నిర్ణయం తీసుకుంటే, డిమాండ్, సప్లయ్ ఆధారంగా మా నిర్ణయం ఉంటుంది. మేము 'పెద్ది' లాంటి సినిమాలకు సెల్యూట్ చేస్తాం. దాని మీద మాకు పగ ఏమీ లేదు. 'పెద్ది'ని ఈ గొడవ నుంచి మినహాయించాలని అనుకున్నాం. కానీ, ఆ సినిమా తర్వాత కూడా మళ్లీ ఎప్పుడు మమ్మల్ని పట్టించుకుంటారనేది అర్థం కాకనే ఈ మూవీని కూడా పర్సంటేజ్ శ్లాబ్‌లో చేర్చాలని నిర్ణయించుకున్నాం. అవసరమైతే అగ్ర కథానాయకుడు చిరంజీవి దృష్టికి మా సమస్యను తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తాం'' అని అన్నారు. ఎగ్జిబిటర్ల నిర్ణయంతో నైజాంలో 'పెద్ది' విడుదల, టికెట్ రేట్ల పెంపుపై సందిగ్ధత కొనసాగుతోంది.ఈ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా జువ్వాడి శేఖర్‌ను ఎన్నుకున్నారు. విలేకరుల సమావేశంలో తెలంగాణ ఎగ్జిబిటర్స్ ప్రెసిడెంట్ విజయేందర్ రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ శ్రీధర్, సుదర్శన్ థియేటర్ బాలగోవింద్ రాజ్, రవీంద్ర గోపాల తదితరులు పాల్గొన్నారు.



రౌడీ హీరోకు ఈసారి డబుల్ బీట్..

రౌడీ జనార్ధనలో మ్యూజిక్ సంచలనం! టాలీవుడ్‌లో వరుస ప్రయోగాలతో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను సొంతం చేసుకున్న విజయ్ దేవరకొండ ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. టాలీవుడ్‌లో వరుస ప్రయోగాలతో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను సొంతం చేసుకున్న విజయ్ దేవరకొండ ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. డైరెక్టర్ రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న గ్రామీణ యాక్షన్ డ్రామా రౌడీ జనార్ధనపై ఇప్పటికే ఇండస్ట్రీలో మంచి బజ్ నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ అప్డేట్ సినీ వర్గాల్లో మరింత చర్చకు దారి తీసింది. రౌడీ జనార్ధన సినిమాకు ఇద్దరు టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్లు కలిసి పనిచేస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే మలయాళ బ్లాక్‌బస్టర్ భ్రమయుగంతో తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కి ప్రశంసలు అందుకున్న క్రిస్టో జేవియర్ ఈ సినిమాకు రీరికార్డింగ్ బాధ్యతలు చేపట్టగా, ఇప్పుడు బాలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ విశాల్ మిశ్రా కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఆయన ప్రధానంగా పాటలకు స్వరాలు సమకూర్చనున్నట్లు సమాచారం. సినిమా మేకింగ్‌లో మ్యూజిక్‌కు ఎంత ప్రాధాన్యం ఉంటుందో తెలిసిందే. ముఖ్యంగా ఇంటెన్స్ యాక్షన్ డ్రామాల్లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కథనాన్ని మరోస్థాయికి తీసుకెళ్తుంది. అలాంటి విభాగంలో క్రిస్టో జేవియర్‌కు ఉన్న ప్రత్యేక గుర్తింపు రౌడీ జనార్ధన సినిమాకు ప్లస్ కానుందని భావిస్తున్నారు. మరోవైపు, మెలోడీలతో పాటూ ఎమోషనల్ ట్రాక్స్‌లో తనదైన ముద్ర వేసిన విశాల్ మిశ్రా ఎంట్రీతో ఈ సినిమాలోని సాంగ్స్ పై కూడా అంచనాలు పెరిగాయి. రెండు విభిన్న స్టైల్స్ ఉన్న మ్యూజిక్ డైరెక్టర్లు ఒకే సినిమాకు పనిచేయడం అరుదైన విషయమనే చెప్పాలి. దీంతో ఈ సినిమా ఆడియో పరంగా కూడా ప్రత్యేక అనుభూతిని అందించబోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా విజయ్ దేవరకొండ లుక్, గ్రామీణ నేపథ్యంలోని యాక్షన్ ఎలిమెంట్స్ సినిమాకు కొత్త ఫీల్ తీసుకొచ్చాయి. ఈ సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటిస్తుండగా, ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబర్‌లో రిలీజ్ చేయాలనే టార్గెట్ తో చిత్ర బృందం వేగంగా పనులు కొనసాగిస్తోంది. విజయ్ దేవరకొండ ప్రస్తుతం రెండు సినిమాలను సమాంతరంగా పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్నారు. డైరెక్టర్ రాహుల్ సాంకృత్యన్ తెరకెక్కిస్తున్న రణబాలి ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం. ఆ సినిమాను సెప్టెంబర్ 11న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు రౌడీ జనార్ధన కూడా వేగంగా షూటింగ్ జరుపుకుంటుండటంతో ఈ ఏడాదిలోనే విజయ్ నుంచి రెండు పెద్ద సినిమాలు రావచ్చన్న అంచనాలు అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా మాస్ యాక్షన్, విలేజ్ బ్యాక్‌డ్రాప్, స్ట్రాంగ్ మ్యూజిక్, విజయ్ దేవరకొండ ఎనర్జీ.. ఇవన్నీ కలిసి రౌడీ జనార్ధనను టాలీవుడ్‌లో మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్స్‌లో ఒకటిగా నిలబెడుతున్నాయి.

'జన నాయగన్' ఇప్పటికీ సెన్సార్ అవ్వలేదు: నిర్మాత

విజయ్ కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'జన నాయగన్'. సంక్రాంతి కానుకగా రావాల్సిన ఈ సినిమా ఇప్పటికీ విడుదలకు నోచుకోలేదు. సెన్సార్ విషయంలో కోర్టుల చుట్టూ తిరగ్గా, ఫైనల్ కమిటీ ఈ మూవీని చూసి, సర్టిఫికెట్ ఇవ్వాల్సిఉంది. ఈ ప్రక్రియ ఇప్పటికీ పూర్తికాలేదని నిర్మాత వెంకట్ కె. నారాయణ అన్నారు. విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ఈ వ్యవహారం ఓ కొలిక్కి రాకపోవడం గమనార్హం. తొలుత ఈ విషయమై స్పందించడానికి నిర్మాత నారాయణ సంశయం వ్యక్తంచేయగా, ఆ తర్వాత సెన్సార్ అవ్వలేదని స్పష్టంచేశారు.''జన నాయగన్' గురించి మాట్లాడానికి ఇది సరైన వేదిక కాదు. నేను ఆలయ దర్శనానికి వచ్చాను. కానీ, ఒక విషయం చెప్పాలనుకుంటున్నా. ఇప్పటికీ సెన్సార్ సర్టిఫికెట్ రాలేదు. దానికోసమే వేచి చూస్తున్నాం. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించి, సినిమాను ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తాం. ఇంతకుమించి మాట్లాడటానికి ఇది వేదిక కాదు'' అని అన్నారు.

'హై జవానీ తో ఇష్క్ హోనా హై' సినిమాపై ట్రైలర్‌తో మరింత హైప్..

బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్, హీరోయిన్లు మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'. వరుణ్ ధావన్ తండ్రి, దర్శకుడు డేవిడ్ ధావన్ దర్శకత్వం వహిస్తున్న ఈ కామెడీ ఎంటర్‌టైనర్ నుంచి తాజాగా ట్రైలర్ రిలీజ్ చేస్తూ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది మృణాల్ ఠాకూర్. కోర్టు సీన్‌తో స్టార్ట్ అయిన ఈ ట్రైలర్‌లో.. వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్ భార్యాభర్తలుగా నటిస్తుండగా, వరుణ్‌కు పిల్లలు కావాలని, కానీ మృణాల్ దానికి సిద్ధంగా లేకపోవడంతో వారు విడాకుల కోసం కోర్టు మెట్లెక్కుతారు. ఆ తర్వాత విదేశాలకు వెళ్లిన వరుణ్ ధావన్, అక్కడ పూజా హెగ్డేను కలుసుకుని ప్రేమలో పడతాడు. అయితే ఊహించని విధంగా అటు మృణాల్ ఠాకూర్, ఇటు పూజా హెగ్డే ఇద్దరూ ఒకేసారి ప్రెగ్నెంట్ కావడంతో కథలో పెద్ద ట్విస్ట్ వస్తుంది. ఇలా ఇద్దరు మహిళల మధ్య ఇరుక్కుపోయిన వరుణ్ ధావన్, ఆ నిజం బయటపడకుండా మేనేజ్ చేస్తూ ఎలాంటి అబద్ధాలు ఆడాడు, ఎలాంటి గందరగోళ పరిస్థితులను ఎదుర్కొన్నాడు చాలా వినోదాత్మకంగా ట్రైలర్ కట్ చేశారు మేకర్స్. ఈ ట్రైలర్‌లోనే మొత్తం కథ అర్థం అవుతుండగా.. సినిమా సూపర్ హిట్ అవుతుందంటూ కామెంట్స్‌తో రచ్చ చేస్తున్నారు నెటిజన్లు. ఇక ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ట్రైలర్ చూసిన డైరెక్టర్ (వరుణ్ ధావన్ తండ్రి) డేవిడ్ ధావన్ ఎమోషనల్ అవ్వడం కూడా విశేషంగా ఆకట్టుకుంటోంది. కాగా.. ఈ చిత్రంలో మనీష్ పాల్, చుంకీ పాండే, జిమ్మీ షెర్గిల్, మౌని రాయ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రమేష్ తౌరానీ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

నా లైబ్రరీలో నెం.1 సినిమా 'పెద్ది': రామ్‌చరణ్

'పెద్ది' మనసు పెట్టి చేసిన చిత్రమని, తన సినీ లైబ్రరీలో ఎప్పటికీ నెం.1గా ఉంటుందని కథానాయకుడు రామ్‌చరణ్ అన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో ఆయన నటించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇది. జాన్వీకపూర్ కథానాయిక. జూన్ 4న తెలుగు సహా ఇతర భాషల్లో విడుదల కానుంది. చిత్ర ప్రచారంలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ కాన్సర్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సినిమా చేయడం ఎంతో గర్వంగా ఉంది..

ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడారు. ''నాకు హిందీ పరిజ్ఞానం కాస్త తక్కువే. కానీ, నా గుండెల్లో మీకున్న (అభిమానులు) స్థానం మాత్రం పెద్దది. భాషను కాకుండా నా భావనను అర్థం చేసుకుంటారని అనుకుంటున్నా. జూన్ 4న మీ హృదయంలో మా 'పెద్ది'కి కాస్త చోటు ఇవ్వండి. ఇది క్రీడా నేపథ్యంతో సాగే కథతో రూపొందిన చిత్రం. ఒక వ్యక్తిజీవితంలో చేసే ప్రయాణం. 'పెద్ది' మిమ్మల్ని నవ్విస్తాడు. స్ఫూర్తి నింపుతాడు. ఈ సినిమా చేయడం ఎంతో గర్వంగా ఉంది. ఈ సినిమాకు మూల స్తంభం ఏఆర్ రెహమాన్. మా దర్శకుడు బుచ్చిబాబు సహా చిత్ర బృందం అంతా సినిమాను మీ ముందుకు తీసుకురావడానికి ఇంకా కష్టపడుతూనే ఉంది. ఈ సినిమా కోసం అనుక్షణం శ్రమించిన అందరికీ ధన్యవాదాలు. 'ఆర్ఆర్ఆర్' నుంచి నాపై ప్రేమ చూపిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు'' అని రామ్‌చరణ్ అన్నారు.

క్లైమాక్స్ ఎవరూ ఊహించలేరు: రవికిషన్..

అంతకుముందు సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ మాట్లాడారు. 'ప్రతి ఫ్రేమ్‌లోనూ రామ్‌చరణ్ 100శాతం ఉంటారు. తన నటన, డ్యాన్స్‌తో నా పాటలకు మరింత వన్నె తెచ్చారు. అన్నింటికన్నా ముఖ్యంగా నేపథ్యంలో వచ్చే పాటలంటే నాకు బాగా ఇష్టం. తెరపై మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తాయి' అని అన్నారు.నటుడు రవికిషన్ మాట్లాడుతూ.. ''ప్రస్తుతం యువత డ్రగ్స్, మత్తుకు అలవాటు పడుతోంది. కానీ, 'పెద్ది' అసలైన యువత లక్ష్యాన్ని చూపిస్తుంది. క్రికెట్, కుస్తీ ఇలా చాలా క్రీడలు ఉన్నాయి. 'త్రీ ఇడియట్స్', 'దంగల్'లా 'పెద్ది' గురించి కూడా మాట్లాడుకుంటారు. యువతను ఉత్తేజపరిచే చిత్రమిది. ఈ కథ మీ హృదయాన్ని తాకుతుంది. థియేటర్ నుంచి బయటకు వచ్చాక 'పెద్ది' మీకు అసలైన హీరోలా కనిపిస్తాడు. మీ కుటుంబంతో కలిసి ఈ మూవీని చూడండి. క్లైమాక్స్‌ను ఎవరూ ఊహించలేరు. రామ్‌చరణ్ నటన మిమ్మల్ని కట్టిపడేస్తుంది. జాతీయ అవార్డు సహా అన్నీ 'పెద్ది'కి రావడం ఖాయం'' అని ధీమా వ్యక్తం చేశారు.

బుచ్చి క్యూట్ డైరెక్టర్: జాన్వీ

ఇలాంటి కథలో నటించడం తన అదృష్టమని జాన్వీకపూర్ అన్నారు. తన ఫేవరెట్ క్రికెటర్ 'పెద్ది' అని చెప్పుకొచ్చిన ఆమె.. రామ్‌చరణ్ చాలా కూల్‌గా ఉంటారని అన్నారు. తనకు తెలుగు సరిగా రాకపోయినా, ఎంతో సహకరించారని, 'పెద్ది' ఎన్నో జ్ఞాపకాలను ఇచ్చిందన్నారు. 'గత ఈవెంట్‌లో దర్శకుడు బుచ్చిబాబును రౌడీ డైరెక్టర్ అన్నాను. కానీ, ఆయన చాలా క్యూట్ డైరెక్టర్' అంటూ నవ్వులు పంచారు.

పర్‌ఫెక్ట్ మసాలా ప్యాకేజ్ మూవీ: దివ్వేందు..

తన కెరీర్‌లో 'పెద్ది' అత్యంత ముఖ్యమైన చిత్రమని నటుడు దివ్వేందు అన్నారు. 'ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతున్నా. రామ్‌చరణ్‌లాంటి నటుడితో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఇందులో నేను రామ్‌బుచ్చి పాత్ర పోషిస్తున్నా. జమీందార్ కొడుకుగా కనిపిస్తా. 'పెద్ది'తో స్నేహం, ద్వేషం అన్నీ ఉంటాయి.ఇదొక పర్‌ఫెక్ట్ మసాలా ప్యాకేజ్' అని చెప్పుకొచ్చారు. 'పెద్ది' చక్కటి థియేటర్ అనుభూతి ఇస్తుందని, స్పోర్ట్స్ డ్రామా అయినా, కమర్షియల్, ఎమోషనల్ ఎలిమెంట్స్ ఉన్నాయని నిర్మాత సతీశ్ కిలారు తెలిపారు.



ఆ మ్యాచ్ రద్దు నుంచే మా ఆటలో తడబాటు: రికీ

విశ్వంభర, స్పోర్ట్స్: ఒకదశలో పంజాబ్ కింగ్స్ అగ్రస్థానంలో కొనసాగింది. తొలి ఏడు మ్యాచుల్లో ఆరు విజయాలతో దూసుకుపోయింది. కేకేఆర్‌తో వర్షం కారణంగా మ్యాచ్ రద్దు అయింది. రెండో స్టేజ్ నుంచి మొదలు.. ఒక్క విజయమూ లేకుండా పోయింది. వరుసగా ఆరు మ్యాచుల్లో పరాజయం చవిచూసింది. ఇప్పుడు తన చివరి మ్యాచ్‌లో గెలిచినా.. ప్లేఆఫ్స్‌నకు చేరుకోవడం కష్టమే. ఇతర జట్ల ఫలితాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. ఇవాళ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. ఈ క్రమంలో తమ జట్టు పతనంపై పంజాబ్ ప్రధాన కోచ్ రికీ పాంటింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ''తొలి ఆరేడు మ్యాచుల్లో మా ఆట అద్భుతం. ఎవరూ వంక పెట్టేందుకు లేదు. మంచి జోష్‌లో మీదున్నప్పుడు కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్ రద్దు అయింది. అప్పటి నుంచి మా దూకుడు కాస్త తగ్గింది. ఆ తర్వాత కూడా నాలుగు మ్యాచుల్లో గెలిచాం. కానీ, ఆధిపత్యం ప్రదర్శించలేకపోయాం. వరుసగా ఆరు మ్యాచుల్లో ఓడిపోయాం. అందుకు మేమే బాధ్యులం. గత కొన్ని వారాలుగా మేం అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించకపోవడం వల్లే ఇప్పుడీ పరిస్థితుల్లో ఉన్నాం. మా బెస్ట్ క్రికెట్ ఎలా ఉంటుందో.. చివరి మ్యాచ్‌లో మేం గెలవడానికి ఏం చేయాలో మాకు స్పష్టమైన అవగాహన ఉంది. ఇప్పుడు మేం ఆ విషయాలపైనే దృష్టిపెట్టాం'' అని రికీ వెల్లడించాడు.

వారి దగ్గర ఇంకేం లేదు..

''ఈ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కోల్పోయేదేమీ లేదు. చివరి మ్యాచ్‌లో విజయం సాధించి తమ ఫ్రాంచైజీ గర్వపడేలా చేయడం మినహా ఇంకేం లేదు. కాబట్టి.. ఇలాంటి టీమ్ చాలా డేంజర్. . మీరూ నిర్భయంగా ఆడితేనే విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందని సూచించా. సానుకూలంగా ఆడాలని మాత్రమే వారికి చెప్పా'' అని పాంటింగ్ తెలిపాడు.

మిచెల్ మార్ష్ దూరం..

తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో మిచెల్ మార్ష్ ఆడే అవకాశం లేదని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ వర్గాలు తెలిపాయి. ఈ సీజన్‌లో ఎల్ఎస్‌జీ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ మిచెల్ మార్ష్ (563 పరుగులు) ఒక సెంచరీ కూడా బాదాడు.

రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు ఊరట

విశ్వంభర, స్పోర్ట్స్: సీనియర్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు ఊరట లభించింది. మే 30, 31 తేదీల్లో జరగనున్న 2026 ఏషియన్ గేమ్స్ సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు దిల్లీ హైకోర్టు ఆమెకు అనుమతి ఇచ్చింది. అదే సమయంలో వినేశ్ ఫొగాట్‌పై కక్ష పూరిత ధోరణిలో వ్యవహరిస్తున్నందుకు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ను తప్పుబట్టింది. ఆసియా క్రీడల కోసం భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) నిర్దేశించిన ఎంపిక ప్రమాణాలు వివక్షపూరితంగా ఉన్నాయని హైకోర్టు సీజే జస్టిస్ దీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ ప్రమాణాలు గత ప్రదర్శనలను పరిగణనలోకి తీసుకోకుండా.. 2025లో పతకాలు గెలిచిన రెజ్లర్లకే అర్హతను పరిమితం చేశాయంది. ప్రసూతి సెలవు కారణంగా విరామం తీసుకున్న వినేశ్ వంటి నిష్ణాతులైన క్రీడాకారిణులను పరిగణనలోకి తీసుకునేందుకు ఎంపిక కమిటీకి ఎటువంటి విచక్షణాధికారం ఇవ్వలేదని న్యాయస్థానం పేర్కొంది. ఎంపిక ట్రయల్స్ నుంచి వినేశ్‌ను మినహాయించడం ఆమె తీసుకున్న ప్రసూతి విరామానికి నేరుగా ముడిపడి ఉందని తెలిపింది. ఫొగాట్ దేశానికి ఎన్నో విజయాలు అందించిన విషయాన్ని ఈ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం గుర్తు చేసింది. దేశీయ ఈవెంట్ల నుంచి ఆమెను నిషేధిస్తూ రెజ్లింగ్ ఫెడరేషన్ జారీ చేసిన షోకాజ్ నోటీసు ఒక ప్రణాళిక ప్రకారం జారీ చేసినట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది.

శ్రేయస్ అయ్యర్ అజేయ శతకం..

పంజాబ్ ప్లే ఆఫ్స్ ఆశలు సజీవం

లక్నో: పరుసగా ఆరు ఓటముల తర్వాత ఎట్టకేలకు పంజాబ్ కింగ్స్ ఘన విజయం సాధించింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో ఆ జట్టు 7 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. అనంతరం 197 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 18 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసింది. ఆ జట్టులో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (101*; 51 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ శతకంతో చెలరేగాడు. ఐపీఎల్‌లో అతడికిదే తొలి సెంచరీ. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (69; 39 బంతుల్లో 7 ఫోర్లు 2 సిక్స్‌లు) అర్ధశతకంతో మెరిశాడు. ప్రియాంశ్ ఆర్య (0) షమీ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతికే వెనుదిరిగాడు. కూపర్ కానెల్లీ (18) బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. సూర్యాంశ్ షిడ్డే (9*) నాటౌట్‌గా నిలిచాడు.లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బౌలర్లలో షమీ 2, అర్జున్ తెందుల్కర్ ఒక వికెట్ తీశారు. ఈ విజయంతో పంజాబ్ ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా మిగిలాయి.

ఈ విజయంతో ప్రస్తుతం పంజాబ్ ఖాతాలో 15 పాయింట్లు ఉన్నాయి. రేపు ముంబయితో రాజస్థాన్ తలపడనుంది. ఈ మ్యాచ్ ఫలితమే పంజాబ్ భవిత వ్యాన్ని తేల్చనుంది. ఆ మ్యాచ్‌లో రాజస్థాన్ ఓడితేనే పంజాబ్ కింగ్స్‌కు అవకాశాలు ఉంటాయి. ఒకవేళ రాజస్థాన్ నెగ్గితే నెట్‌రన్‌రేట్‌తో సంబంధం లేకుండా నేరుగా ఆ జట్టు ప్లే ఆఫ్స్‌నకు చేరుతుంది. అప్పుడు పంజాబ్ ఇంటి ముఖం పట్టాల్సి వస్తుంది.

ఈ మ్యాచ్‌లో తొలుత లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బ్యాటర్లలో జోష్ ఇంగ్లిస్ (72; 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆయుష్ బదోని (43; 18 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. అబ్దుల్ సమద్ (37*), రిషభ్ పంత్ (26) ఫర్వాలేదనిపించారు. కులకర్ణి (0), నికోలస్ పూరన్ (2), ముకుల్ చౌదరి (1) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. అర్జున్ తెందూల్కర్ (5*) నాటౌట్‌గా నిలిచాడు. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో మార్కో యాన్సన్, యుజ్వేంద్ర చాహల్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అజ్మతుల్లా ఒమర్జాయ్, శశాంక్ సింగ్ చెరో వికెట్ తీశారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com